కొత్త పింఛన్.. ఎప్పుడొచ్చేనో!

- కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నరైనా ఓపెన్ కాని సైట్
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్హులు

పాలకోడేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కొత్త పింఛన్‌లకు మోక్షం లభించడం లేదు. వృద్ధాప్య, వితంతు పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు నిరంతరం ఆయా గ్రామాల సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడం లేదని అధికారులు తేల్చేయడంతో ఉసురుమంటూ వెనుతిరుగుతున్నారు. పైగా ఉన్న పింఛన్లు తొలగించే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో పింఛన్లు, రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తే కూటమి పాలనలో దీనికి భిన్నంగా ఉంటుందని అర్హులు వాపోతున్నారు.


శృంగవృక్షం సచివాలయం భవనం

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన సైట్

2024 ఏప్రిల్ 18 నుంచి సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో ఆగిన పింఛన్ల సైట్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా ఇంకా ఓపెన్ చేయకపోవడం పై ప్రజలు సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. పింఛన్ల కోసం 60 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు ఉండి నియోజకవర్గంలో ఆకివీడు, పాలకోడేరు, ఉండి, కాళ్ల మండలాల్లోని అన్ని రకాల పింఛన్ లబ్ధిదారులు 20వేల మంది ఉంటారని అంచనా ఉంది.

హామీకే పరిమితమైన 50 ఏళ్లకే పింఛన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారం లోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఆ హామీ మాటే ఎత్తడం లేదు. వృద్ధాప్య పింఛన్ తీసుకునే భర్త చనిపోతే స్పౌజ్ కేటగిరీ కింద అరకొర మందికే గత నెలలో పింఛన్లు మంజూరు చేశారంటూ అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటిదాకా సైట్ ఓపెన్ చేయకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులను ప్రశ్నిస్తే తమపై కక్షకట్టి ఎక్కడ కొత్త పింఛన్ మంజూరు చేయరనే అనుమానంతో వారిని ప్రశ్నించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులకు నూతన పింఛన్లను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

ఎప్పుడిస్తారో ఏమో?



నాకు 60 ఏళ్లు నిండాయి. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వెళ్తే ఇంకా కొత్త పింఛన్‌ల కోసం సైట్ ఓపెన్ అవ్వలేదని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొత్త పింఛన్ కు సంబంధించి సమాచారం రాలేదని చెబుతున్నారు. కొత్త పింఛన్ ఎప్పుడు ఇస్తారో ఏమో?

– పోతురాజు దేవిడ్, కుముదవల్లి

నిరంతరం ప్రక్రియ ఉండాలి



పేదలకు ఇచ్చే పింఛన్లు రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం ఇంత వరకు సైట్ ఓపెన్ చేయకపోవడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి.

– సోదదాశి నరేష్, వైస్ ఎంపీపీ

ఆదేశాలు రావాల్సి ఉంది



కొత్త పింఛన్లు మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. స్పౌజ్ పింఛన్‌లకు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇతర పింఛన్లు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సైట్ ఓపెన్ కాలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే అర్హులనుంచి దరఖాస్తులను స్వీకరిస్తాం.

– వి.రెడ్డియ్య, ఎంపీడీఓ, పాలకోడేరు

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ

కాళ్ల: రైతుల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉంటుందని వారు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులతో కలిపి పోరాటం చేస్తామని ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. మండలంలోని పెదఅమిరం పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను చంద్రబాబు ఎప్పుడు చిన్నచూపే చూస్తారని గుర్తు చేశారు. గతంలో వ్యవసాయం దండగ అని రైతులను అవమానపరిచారని తెలిపారు. ఇప్పటికే రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా యూరియా కోసం రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఈ కూటమి పాలనలో వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలందించినట్లు చెప్పారు. రైతులకు పెట్టుబడి సాయం ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు రైతుకు భరోసా ఇచ్చేవారని తెలియజేశారు. రైతులను ఇబ్బంది పెడితే ఏ ప్రభుత్వమైనా నిలబడదన్నారు. రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఎరువులు కొనాలంటే దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి రైతుకు రావటం దారుణం అన్నారు. రైతుల పక్షాన ఈ నెల 9వ తేదీన ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాలు అందిస్తామన్నారు. నియోజవర్గంలో రైతులతోపాటు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో గణేశ్న రాంబాబు, సీహెచ్ పాపారావు, అంబటి రమేష్, వేగేశ్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


అన్నదాత పోరు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పీవీఎల్ నరసింహరాజు

తులసీరావుకు ఎంపీపీ పరామర్శ


తులసీరావును పరామర్శిస్తున్న విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు తిరుమాని తులసీరావును ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు శనివారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన తులసీరావు మండలంలోని కొత్తపూసలమర్రు గ్రామంలో తన నివాసంలో చికిత్స తీసుకుంటున్నాడు. తులసీరావు ఆరోగ్య పరిస్థితి గురించి విజయనరసింహరాజు తెలుసుకుని అధైర్య పడవద్దని మేమంతా అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దా ఫిలిప్, తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ

వీరవాసరం: సమాజంలో ఉన్న పేదరిక నిర్మూలన కోసం కృషి చేసిన గొప్ప నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకట్రాయుడు తెలిపారు. మండలంలోని కొణితివాడ గ్రామంలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇష్టానుసారంగా ఎన్నో అబద్ధపు హామీలు, బూటకపు మాటలు చెప్పి కూటమి పార్టీ అధికారంలోకి వచ్చాయన్నారు. అధికారం చేపట్టి 15 నెలలు కావస్తున్నప్పటికీ ప్రజలకు ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చక అన్ని వర్గాలను మోసం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ ఒక వైఎస్సార్ సీపీ మాత్రమే అన్నారు. అనంతరం నూతనంగా ఎంపికైన కొణితివాడ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణ మూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మానుకొండ ప్రదీప్ కుమార్, నాగరాజు వెంకట శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చినమిల్లి వెంకటరాయుడు

ఇరువర్గాలపై కేసు నమోదు

ఉండి: మండలంలోని చెరుకువాడలో శుక్రవారం చోటు చేసుకున్న ఘటనపై పోలీసులు ఇరువర్గాలపై శనివారం కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముందుగా యేలేటి ఏసురాజు అతని స్నేహితులు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గ్రామంలోని మద్యం దుకాణానికి వెళ్లగా అక్కడ చేబ్రోలు నాని, చేబ్రోలు వెంకన్న, అలివేలు మంగన్న అనే ముగ్గురు కలసి కులంపేరుతో దూషించి కొట్టారు. అది గమనించి అడ్డుపడిన మహిళలను కూడా కులంపేరుతో దూషించి కొట్టారు. ఈ ఘటనపై ఏసురాజు ఫిర్యాదు మేరకు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు ఏఎస్సై మోహన్‌రావు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే మరో వర్గం ఫిర్యాదు ప్రకారం యేలేటి సురాజు, యాళ్ళ ఏసురాజు, గునుపూడి బుజ్జిబాబు,ఏలూరి బుల్లియ్య, కొర్రపాటి ఏసు అనేవారు స్థానిక మద్యం షాపులో మద్యం సేవించి గొడవపడుతుండగా చేబ్రోలు వెంకటసత్యనారాయణ అనే వ్యక్తి గొడవ పడొద్దని చెప్పినా మాట వినకుండా షాపులోని సామగ్రి ధ్వంసం చేయడంతో పాటు తనను కులంపేరుతో దూషించారు. అయితే కొంతసేపటికి అక్కడి నుంచి వెళ్లిపోయిన వారంతా తిరిగి వచ్చి షాపు ధ్వంసం చేసి బీరు సీసాలు పగులగొట్టి పొడించేందుకు ప్రయత్నించారు. అది తెలిసిన పామర్తి నాగలక్ష్మి, నాగేశ్వరరావు షాపు వద్దకు వస్తుండగా ముద్దాయిలతో పాటు పులిదిండి ఆశమ్మ, నిమ్మితి మార్తమ్మ అనేవారు వారిని అడ్డగించి మెడలో తాళిబొట్టు లాక్కుని వెళ్లిపోయారు. అలాగే షాపు కౌంటర్‌లోని రూ.15 వేలు తీసుకునిపోయినట్లు వెంకటసత్యనారాయణ పోలీసులను ఆశ్రయించాడు. గ్రామంలో ఉద్రిక్తత నేపథ్యంలో అడిషనల్ ఎస్పీ భీమారావు, డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలతో గ్రామంలో బందోబస్తు కొనసాగించారు.

క్లుప్తంగా

మావుళ్లమ్మ సన్నిధిలో అన్నసమారాధన


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఉపాలయమైన శ్రీ అశ్వత్థ గణపతి నవరాత్రులలో భాగంగా శనివారం అన్నప్రసాద సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతులు మీదుగా అన్న సంతర్పణ ప్రారంభించారు. సుమారు 3500 మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు.

బాలాత్రిపుర సుందరీ దేవికి వెండి సమర్పణ


అమ్మవారికి వెండి సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి శనివారం దాతలు 400 గ్రాముల వెండి సమర్పించారు. మెంటేవారి తోటకు చెందిన నైనాలశెట్టి సుబ్బారావు వారి కుమారులు రామకృష్ణ దంపతులు 400 గ్రాముల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలకు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేటీఎం 160 డ్యూక్ బైక్ విడుదల


కేటీఎం 160 డ్యూక్ బైక్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో సరికొత్త కేటీఎం 160 డ్యూక్ బైక్‌ను భీమవరంలోని వరుణ్ మోటార్స్ షోరూంలో సీఈవో ఎ.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ సురేష్, బి.సూర్యప్రకాష్‌లు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత అభిరుచి అనుగుణంగా ఈ బైకును రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ ఎ.గోపీచంద్, బ్రాంచ్ మేనేజర్ బి.శివాజీ పాల్గొన్నారు.

గంగాధరశాస్త్రికి సత్కారం


భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో గంగాధరశాస్త్రిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎల్‌వీ గంగాధరశాస్త్రి భగవద్గీత ప్రచారంలో చేస్తున్న కృషిని అభినందిస్తూ భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సన్మానించారు. ఈ సభలో ప్రముఖులు గంగాధర శాస్త్రి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంతవర్మ, ఉపాధ్యక్షుడు ఎస్వీ నాగరాజు, డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

ప్రగతి నివేదికపై వర్క్‌షాప్


మాట్లాడుతున్న మార్కండేయేశ్వరరావు

ఆకివీడు: పంచాయతీలు అభివృద్ధిలో ప్రగతి సాధించి జాతీయస్థాయిలో అవార్డు సాధించే దిశగా ముందుకు వెళ్లాలని ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు పిలుపునిచ్చారు. పంచాయతీల ప్రగతిపై నివేదిక రూపొందించేందుకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధిని ఏబీసీలుగా గుర్తించి మార్కులు ఇస్తారన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆయా పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి, వివిధ శాఖల ద్వారా చేపట్టిన ప్రగతి పనుల్ని విశ్లేషిస్తూ ఈ నెల 25,26 తేదీల్లోపు నివేదికలను పంపాలని సూచించారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ–2 సీతారామయ్య, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, డీపీఆర్‌సీ రీసోర్స్‌పర్సన్ కేఎస్ఎస్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైకుంఠరావు

భీమవరం: పట్టణంలోని తాడేరు రోడ్డులోని 82 ఎకరాల్లో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను వేగవంతంగా పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వాలని సీపీఎం చినరంగని పాలెంశాఖ డిమాండ్ చేసింది. శనివారం మెంటేవారి తోట సుందరయ్య భవనంలో చెల్లబోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ నాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులు ప్రభుత్వానికి డబ్బులు కట్టి 12 ఏళ్లు గడిచిపోయినా ఇంతవరకు ఇల్లు స్వాధీనం చేయకపోవడం సిగ్గు చేటని మండిపడ్డారు. కొంతమందికి ఇళ్లు స్వాధీనం చేసినా ఇళ్లలో నివాసముంటున్న వారికి కనీస మౌలిక వసతులు కల్పించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చెల్లబోయిన వెంకటేశ్వరరావు, మద్దాల రాంబాబు, అన్యం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

భీమవరం: వేరొక మహిళతో తన భర్త వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నాడంటూ ప్రకాష్‌నగర్‌కు చెందిన గండికోట పల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు టుటౌన్ ఎస్సై రహమాన్ శనివారం తెలిపారు. పల్లమ్మకు గణపవరం ప్రాంతానికి చెందిన జానీ రత్నంతో వివాహమైంది. భర్త వేధింపులను భరించలేక పోలీసులను ఆశ్రయించింది.

రెండు పాఠశాలలకు స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు

పాలకోడేరు/వీరవాసరం: పాలకోడేరు మండలం గొరగనమూడి స్వామి జ్ఞానానంద ఉన్నత పాఠశాల, వీరవాసరం మండలం, తోలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను సొంతం చేసుకున్నాయి. ఈ విషయాన్ని ఆయా పాఠశాలల హెచ్ఎంలు బి .శ్రీదేవి, కిషోర్ కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం భీమవరం ఏఎస్ ఆర్ సేవసదన్‌లో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో అవార్డులను అందుకున్నట్లు వివరించారు.

గోదావరి గట్టున చెత్త డంపింగ్ నిలుపుదల

నరసాపురం: గోదావరిగట్టున చెత్తను డంప్ చేయడం పూర్తిగా నిలుపుదల చేసినట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశారు. డంపింగ్‌యార్డ్ కోసం వేములదీవి, సరిపల్లి గ్రామాల్లో మున్సిపాలిటీ కొనుగోలు చేసిన రెండు స్థలాల్లో కూడా చెత్తను వేయడానికి ఆయా గ్రామస్తులు అంగీకరించడం లేదని పేర్కొన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని వివరించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పెనుగొండ: ఆచంట మండలంలో శనివారం వ్యవసాయ శాఖ, విజిలెన్స్ శాఖలు సంయుక్తంగా ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దివ్యసాయి ఏజెన్సీస్, సాయిరాం ఎంటర్‌ప్రైజెస్ షాపులను తనిఖీ ఎటువంటి వ్యత్యాసం లేదని అధికారులు తెలిపారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా గణపతి నిమజ్జనాలు

భీమవరం: పట్టణంలోని రెస్ట్ హౌస్‌రోడ్ జాలర్ల వీధిలో 108 కళశాలలో నీరుతెచ్చి గణేష్ నిమజ్జనం శనివారం వైభవంగా నిర్వహించారు. 108 మహిళలు గంగానమ్మ ఆలయం నుంచి కళశాలతో గంగాజలం తీసుకువచ్చి పూజలో ఉంచిన వినాయక మట్టి విగ్రహాన్ని నిమజ్జనం చేసి మట్టిని ప్రసాదంగా భావించి పంట పొలాలు, ఆక్వా చెరువులు, మొక్కలకు వేయడానికి తీసుకువెళ్లారు. నిమజ్జనంగా సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు సన్నాయి మేళం, కలశాలతో మహిళలు ఆకర్షణీయంగా సాగింది. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, విజ్జురోతి రాఘవులు, కరుకు పోతురాజు, రామిరెడ్డి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

లడ్డూ రూ.35 వేలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక 28వ వార్డు రెస్ట్ హౌస్ రోడ్డు వరసిద్ధి వినాయక చవితి 24వ వార్షిక మహోత్సవంలో శనివారం జరిగిన లడ్డు వేలం పాటలో 16 కిలోల లడ్డూను రూ 35 వేలు పలికింది. పట్టణానికి చెందిన చాట్రాతి రమేష్ 16 కిలోల లడ్డు రూ 35 వేలకు దక్కించుకున్నారు. అదే విధంగా 5 కిలోల లడ్డు రూ 5,100 లకు పడమటి రామకృష్ణ వేలంపాటలో దక్కించుకున్నారు. అనంతరం గణేష్ నిమజ్జనం నిర్వహించారు

కాళ్లలో..

కాళ్ల: గణపతి నవరాత్రి వేడుకలు మండలంలో ఘనంగా ముగిశాయి. శనివారం పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలు భారీ ఊరేగింపుల నడుమ, బాణసంచా కాల్పులతో, తీన్మార్ వాయిద్యాలతో యువకులు ఉత్సాహంగా నిమజ్జనాల కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా కాళ్ల, కాళ్ళకూరు, దొడ్డనపూడి, ఏలూరుపాడు, కోపల్లె, జొండాడ, కలవపూడి తదితర గ్రామాల్లో నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది.


ఆకివీడు: వాడపల్లివారి వీధిలో గణపతి ఊరేగింపు

ఆకివీడులో..

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా పలు చోట్ల శనివారం గణపతి విగ్రహాలను ఊరేగించారు. స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని, వివిధ శక్తి వేషాలు, తీన్‌మార్, డప్పుల వాయిద్యాలతో ఊరేగింపులు వైభవంగా నిర్వహించారు. స్థానిక సంతపేటలో వినాయకుడి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం స్థానిక వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో నిమజ్జనం చేశారు.

వీరవాసరంలో..

వీరవాసరం: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో నిమజ్జనం ఉత్సవాలను ఘనంగా చేపట్టారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళ, తాళాలతో బాణసంచా కాల్పుల మధ్య వినాయక విగ్రహాలకు నిమజ్జనం ఉత్సవాలను చేపట్టారు.

అలరించిన భగవద్గీత పారాయణం

ఉండి: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఉండి మండలం చిలుకూరులో శుక్రవారం రాత్రి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత బోలిశెట్టి చేతన చేసిన భగవద్గీత పారాయణ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో చేతన రెండు గంటలపాటు ఏకధాటిగా 150కి పైగా భగవద్గీత శ్లోకాలు,భజన గోవిందం, శివానంద లహరి పారాయణాలు పూర్తి చేసింది. అనంతరం నిర్వాహకులు, గ్రామ పెద్దలు చిన్నారిని ఘనంగా సత్కరించారు.


కాళ్ల: దొడ్డనపూడిలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న యువకులు


భీమవరం: వినాయక నిమజ్జనానికి కళశాలతో వస్తున్న మహిళలు


భీమవరం (ప్రకాశంచౌక్): వేలంలో పాడుకున్న లడ్డూలతో భక్తులు

చిన్న తరహా పరిశ్రమలపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: వ్యాపారంలో ప్రధానంగా మేనుఫ్యాక్చరింగ్, సర్వీసు సెక్టార్, ట్రేడింగ్ అనే మూడు ప్రధాన అంశాలు ఉంటాయని ప్రతి వ్యాపారానికీ డబ్బే అవసరం లేదని సరైన ప్రణాళిక ముఖ్యమని జాతీయ సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్మెంట్ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ ముత్యాల శరత్ అన్నారు. శనివారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆవిష్కార్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ వ్యాపారం అనేది జీవన సరళి అన్నారు. మన ప్రణాళికలను నిపుణులైన వారికి తెలియజేసి, వారి సలహాలను స్వీకరించాలన్నారు. మేనుఫ్యాక్చరింగ్ అనేది ఖర్చుతోను అనుభవంతోనూ కూడుకున్నదని సూచించారు. ముఖ్యంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకులు నోబుల్ రాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ రమణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఆలయం ప్రాంగణంలో నిర్వహించారు. దేవస్థానం చైర్మన్‌గా వేగేశ్న రామ్మూర్తిరాజుతో సహా సభ్యులుగా మరో ఏడుగురు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆకివీడు గ్రూపు దేవాలయాల ఈఓ అల్లూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

వామపక్షాలు సంఘటిత ఉద్యమాలతో ముందుకెళ్లాలి

భీమవరం: వామపక్షాలు సంఘటిత ఉద్యమాలతో ముందుకెళ్లడమే సురవరం సుధాకర్ రెడ్డికి ఇచ్చిన ఘన నివాళి అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. భీమవరం ఛాంబర్‌ఆఫ్ కామర్స్ భవనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన శనివారం సుధాకరరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు.

దూరవిద్యపై అవగాహన

పాలకోడేరు: గ్రామంలో దూరవిద్యపై అవగాహన కల్పిస్తూ ఎంఈఓ–2 తంగిరాల హరి ఆనంద్ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.భారతి విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బంగారు గోపి పాల్గొన్నారు.